# బుట్టబొమ్మల గాంభీర్యం

(కథానిక)

విశాఖపట్నం పోవటం నాకదే మొదటిసారి. ఆ సముద్రతీరం, ఆ హార్బరు చూడ్డామని ఎప్పటినుండో కోరిక. కాని తెలిసిన యేఒక్కరూ లేకపోవటంవల్ల యింతవరకు పోయే అవకాశం దొరకలేదు.

మా బావగారి అక్కయ్య విశాఖపట్నంలో వుందని నాకు యిప్పటివరకు తెలీదు. తెలియటానికి మాలో మాకు రాకపోకలుండేకదూ! మా బావ, నేనూ కలిసిరావటం ముఖ్యంగా బట్టలు కొనేందుకనే చెప్పుకోవాలి. మేం యింట్లో అడుగు పెట్టామో, లేదో, సీతాలక్ష్మి (బావఅక్క) ముందుకువచ్చి

"ఏంరా తమ్ముడూ! ఇదేరావటమా? ఓవుత్తరం ముక్కవ్రాస్తే యేం పోయింది? మా మరదలు రాలేదూ?" అంది.

"వుత్తరం వ్రాయటానికి వ్యవధిలేకపోయిందక్కా. అయినా యిప్పుడేం పోయిందిగనక. మి మరదలు మాటన్నావా—అది రావటానికి వీల్లేకపోయింది"

"ఈ అబ్బాయి యెవర్రా?" ఆ మాత్రం అడిగినందుకు నాలో నేనే నామెను అభినందించుకున్నా. యెందుకంటే కొందరు విచిత్రవ్యక్తులు కొత్తమనుషుల్ని పరిచయం చేసుకోకండా కొత్తగానే వుంచుకుంటారు.

"నీకు తెలీదూ? మా బావమరిది. చిన్నప్పుడెప్పుడో చూచివుంటావు."

"అయివుండొచ్చు-పదండి లోపలకి. స్నానం చేస్తే వేగం రెండు మెతుకులు నోట్లో వేసుకుందురుగాని. ప్రయాణబడలికలో మరీ ఆకలేస్తుంది."

ఆమె చెప్పినట్లుగానే మేం లోపలికిపోయాం. కొన్ని నిముషాల్లో స్నానం ముగించాం. సీతాలక్ష్మి వంటప్రయత్నం మహాజోరుగా సాగిస్తోంది. సోమరిగా కూర్చుందుకు మనసొప్పక నేను తెచ్చిన వారపత్రిక తెరిచి చదవసాగాను.

యింతలో ఓ యువకుడు అక్కడకు రావటం జరిగింది. తరువాత తెల్సింది, అతడామె కొడుకని. వచ్చీ రావటంతో—

"ఏం మామయ్యా! యెప్పుడు రావటం?" ఏదో అలవాటుగా అడిగేశాడు గాని, కళ్ళారా చూస్తూ యెప్పుడు రావటం అని అడిగాడేమిటా అని నేనూ చూస్తున్నా.

"ఇదేరావటంరా, రామం నువ్వెక్కడినుంచి?" అన్నాడు బావ.

"స్టేషనులో కొద్దిగాపనుండి పోయివస్తున్నా" అంటూ అక్కడినుండి జారుకున్నాడు.

అప్పటి నా కోపాన్ని నేను ఆపటం కష్టమయింది. కాస్త అభిమానంకూడా దెబ్బతిన్నట్టు బాధపడ్డా. నేనింతమనిషినీ బావ ప్రక్క కూర్చుంటే, యెంత అపరిచితుడనే అయినా కనీసం యీ అబ్బాయి యెవరైనా అడగొద్దూ! అమహా వ్యక్తికి నాతో పరిచయం చేసుకోవటం, పలుకరించటం చిన్నతనమనిపించి వుంటుంది.

మరికొద్దిసేపట్లో అందరం భోజనాలకు తయారయ్యాం. కూర్చున్న దగ్గరినుండి యేవో ఒకదాని తరువాత ఒకటి వుపన్యాసంగ యిస్తూనే వున్నాడు రామం. నాకు తలనొప్పిగా వుంది కూడా. యింతలో మా బావ అసలు రంగంలోకి దిగటం, నాపాలిట భగవంతుడయ్యాడా సమయంలో.

"ఏంరా రామం! మంచిబట్టలు, అనువైన ధరలకు దొరికేషాపు యేదటావ్?" అన్నాడు బావ రామంవేపు తిరిగి.

"అమ్మను తీసికెళ్ళండి మామయ్యా! అదే చూపిస్తుంది."

"ఏం? నువ్వురాకూడదూ?"

"నేను రావటానికి వీల్లేకనే మరి—యివ్వాళ ఓ మీటింగ్ వుంది. దానికి నేను ఆర్గనైజర్ని. ఎలా తప్పించుకు రాగలను చెప్పండి..."

"అయితే యిప్పుడే రాజకీయాల్లో పడినట్లేనా?"

ముద్దంశెట్టి హనుమంతరావు

"యీమధ్య ఆంధ్రరాష్ట్రంకోసం జరిగిన అలజడిలో మన నాయకత్వంకూడా వుంది" అన్నాడు రామం. అతని మాటల్లో అంతా బహు వచనం వుపయోగిస్తూ యెంతో గర్వంగా చెబుతున్నాడు.

"అబ్బో! అంతవరకు వచ్చావురా" అంటూ యేదో ధ్యాసగా చూస్తున్నాడు మాబావ.

"ఏమిటి మామయ్యా, అలాచూస్తున్నావ్?" సమయం దొరికితే తనగొప్పతనమంతా ఒకేసారి ఒలకబోసుకోవాలన్న వుద్దేశంతో.

"ఏమీ లేదులే! ఆ సూటు యెప్పుడు కుట్టించావ్‌రా? చాలా బావుంది బట్ట"

"యీమధ్యనే కుట్టించా. మరోబట్టతీసి కుట్టడానికిచ్చా. అదింతకంటె సూపర్ ఫైన్‌గా వుంది"

"నీకేమిటోయ్! అమ్మకి అల్లారు ముద్దుల కొడుకివి" అన్నాడు బావ. రామం నవ్వేసి వూరుకున్నాడు.

అన్నీ బాగానే వున్నయ్, గాని నావిషయం పట్టించుకోకపోవటం, నాకు ప్రాణాంతకంగా అవమానకరంగా వుంది. అతనికెందుకో ఆ అహం భావమని నాలో నేనే అనుకున్నా. అప్పుడే, అక్కడే ఓ చిన్న కథ రాసిపారేద్దామనుకున్నా. కాని వీలుచిక్కింది కాదు. యింతవరకు అనుకోకుండా ఆగవలసివచ్చింది. కాస్త డబ్బున్నవాడ నేమో, ఆ మదం.

ఆ యిల్లు చూస్తూంటే నాకే ఆశ్చర్యం కలిగించింది. ఇంటినిండా ఫర్నిచరే. అతడి టేబిలు మీద ఓ అరడజను వాసననూనె బుడ్లు, మూడు సెంట్లు బుడ్లు వున్నయ్. ఏవో రకరకాల పుస్తకాలున్నయ్. అందులో యే ఒక్కటీ వుపకరించేది లేదు. నేనెంతోమంది భాగ్యవంతుల యిల్లు చూశాగాని, యింత హంగమా చూడలేదు. వాళ్ళందరికంటె భాగ్యవంతుడైవుండాలిమరి, అనుకున్నా నాలో, మరి అంతకంటె నాకేం తెలుసుగనక—అతడు రాజకీయాల్లో పాల్గొంటున్నట్టు నాకేం నమ్మకం కలుగలేదు, ఎక్కడచూచినా సెక్సు పుస్తకాలే.

* * *

మధ్యాహ్నం భోజనాలైన తరువాత అందరం సావకాశంగా కూర్చుని మాట్లాడుకుంటున్నాం. మాటల సందర్భంలో బావ చెప్పాడు.

"అక్కయ్యా! మరికొద్దిసేపుపోయాక మనం బట్టలకొట్టుకి పోవాలి. రామాన్ని రమ్మంటే, వాడికేదో మీటింగు వుందంట."

"ఔనురా! యీమధ్య వీడికి మీటింగులు, గీటింగులు హెచ్చయిపోతున్నయ్. సరేగాని, యేంబట్టలు కొంటావురా?" అంది సీతాలక్ష్మి కొడుకు గొప్పతనాన్ని కొద్దిగా పొగుడుకుంటూ.

"యిదిగో యీ అబ్బాయికి పెళ్ళికదూమరి, వాడికోసం, యింకా కొన్ని చీరలు కొనాలి" నన్ను చూపిస్తూ అన్నాడు బావ.

"సరేలేరా. నాకు తెలియని బట్టలకొట్లు లేవులే. పేరుగలది వూరు చివరనుంది. అక్కడ మనకు కొనవలసినవన్నీ దొరుకుతాయి" అంది మళ్ళీని.

"నీకు ధరలు తెలుసునని రామం చెప్పాడు" అన్నాడు బావ మరింత సీతాలక్ష్మిని అందనా లెక్కిస్తూ.

"మన రాం పెళ్ళికి సరిగ్గా రెండువేల రూపాయలు, బట్టలకే పోశాం. అన్నీ సరసమైన చౌక ధరలకే యిచ్చాడు. ఎంతయినా పెళ్ళి పెళ్ళేమరి! శుభసమయం. ఎంత ఖర్చుపెట్టినా ఆనందానికేగా. యిలాంటిరోజు మలెప్పుడు వస్తుందిగనక. మీరేమాత్రం పట్టుకున్నారు? కనీసం వెయ్యి రూపాయలైనా తెచ్చివుంటారులే."

"అంతవరకు సాగలేం అక్కయ్యా! అంత డబ్బు వుండొద్దూ! ఆనందానికి అంతం వుందా? ఎంతవున్నా తృప్తి అంటూ వుండదు. వున్నదాంతో తృప్తిపడాలి మరి."

"నువ్వూ అలాంగంటూవేంటిరా? అప్పు చెయ్యి. తర్వాత తీర్చుకోలేకపోతావా?"

"నేనైతే ఫరవాలేదక్కా! వాడికి అప్పంటే భయం" అన్నాడు బావ. సీతాలక్ష్మి నావేపొకసారి చూచి యేమనుకుందోయేమోమరి యితర అడ్డమయిన అడ్డుప్రశ్నలు వేయకండ వూరుకుంది.

సాయంకాలం నాలుగయింది. ఎండ తీవ్రం చల్లారింది. సీతాలక్ష్మి యింటికి బట్టలుకొట్టు యేమంత దూరంగా వుండదు. నడిచిపోదామని మొదట్లో మేం అనుకున్నాం. అయితేనేం, సీతాలక్ష్మి రిక్షాలోతప్ప తను బయట కాలు పెట్టడం బ్రహ్మాండం మునిగిపోయినంత పనవుతుందనటం వల్ల, బావ రెండు రిక్షాలు చేయించవలసివచ్చింది.

కొద్దో గొప్పో సంపాదించుకుంటూ, కొంత స్టయిల్ మెయింటెయిన్ చేస్తున్న మేంకూడా నడిచేందుకు సిద్ధపడితే ఆమెకు చిన్నతనంఅనిపించింది. పాపం! సుకుమారి మరి—

రిక్షాలు ఓ పెద్ద కొట్టుముందాగాయి. రిక్షా నుండి దిగాం. బావ రిక్షావాళ్ళకి డబ్బులిస్తూంటే వాళ్లు తక్కువని నసిగారు.

“ఏంవిటిరా! కొత్తలా చెప్తున్నావ్. నేను ప్రతిరోజూ రిక్షామీద తిరుగుతూనే వుంటా. యింకింతకంటె యెక్కువ యెవరిస్తారు?”అంది సీతాలక్ష్మి తన గొప్పతనాన్ని వెల్లడిచేస్తూ. నాకు మహచెడ్డ నవ్వొచ్చింది—ప్రతీ విషయంలో తన ఆధిక్యాన్నీ, గొప్పతనాన్ని, మహారాణిలా సూచించుకొంటుందని. రిక్షావాడికి మాత్రం మాటలు చెప్పాలా వాడూ ఏమేమో నాలుగు మాటలనేసి పోయాడు.

బట్టలకొట్టులో ప్రవేశించాం. ముందు సీతాలక్ష్మి ఠీవిగానడుస్తుంటే మేంవెనక బాడీగార్డుల్లా పోతున్నాం. మమ్మల్ని చూచిన వ్యాపారి అలజడిగా కుర్చీల నేర్పాటుచేశాడు. సీతాలక్ష్మి తనకెంతో పరిచయంవున్న చోటని తెలియపర్చేందుకేమో, లేచి యిటూ అటూ పచారుజేస్తూ బీరువాల్లోవున్న బట్టల్ని చూస్తుంది. వర్తకుడు దగ్గరకు వచ్చి,“ఏంకావాలి చెప్పండిసార్!” వినయపూర్వకంగాఅడిగాడు, సీతాలక్ష్మి ఠక్కున అందుకుంది.

“యీయన మాతమ్ముడు లెండి. చాలదూరం నుండి వచ్చాడు. నన్ను రమ్మని బలవంత పరిస్తే మీ షాపుకే తీసుకొచ్చా.”

“అంతేలెండి-మీదయ వుండిగనక” అన్నాడే గాని ముఖం ఆముదం తాగినట్టు పెట్టాను.

“ఇప్పుడు మాకు కావలసినవి పెళ్ళి బట్టలు. సిల్కుచీరలు చూపించండి.”

“సరేనండి...”

“సరేనంటె కాదు. మేం మొన్న కొన్నంత ఖరీదువి అవసరం లేదట. అంతకంటె కొద్దిగా తక్కువ ఖరీదువి చూపించండి.”అంది సీతాలక్ష్మి. నాకు శరీరమంతా తేళ్లూ, జెర్రెలూ ప్రాకినట్టయింది. “అలాగేనండి”అని ఓ పదిరకాల సిల్కుచీరలు వరుసగా తెచ్చిపడేశాడా వ్యాపారి. బావ సీతాలక్ష్మిని మంచివి యెంచమన్నాడు. ఆమె నాలుగు చీరలు ఏరింది. ఆమెకు నచ్చినవి నాకు పూర్తిగా నచ్చలేదు. నాకు నచ్చినరంగులు చూపిస్తూ అవే తీసుకోమన్నాను. మా బావకూడ యీ విషయంలో వాళ్లక్కయ్య మాట దాటిపోతున్నందుకు విచారిస్తూ అవే తీసుకున్నాడు. ఆమె నాకు బట్టల సంగతి తెలీనట్టు తనకే తెలిసినట్టు, అహంభావంతో చిరునవ్వు నవ్వుతుంది. ఆమె నవ్వుల్ని లెక్క చేసేవాడెవడు?

బేరసారాలు, డబ్బు యిచ్చి పుచ్చుకోవటం జరిగిపోయింది. మాక్కావలసిన జరీపంచె మాత్రం దొరకలేదు. ఆ వ్యాపారి ఎంతో ఆప్యాయంగా మరునాడు రమ్మన్నాడు. జరీపంచె తెచ్చి ఇస్తానని హామీ యిచ్చాడు. మేం వెళ్ళిపోయేందుకు బయలుదేరే సమయంలో చేతులు నులుపుకుంటు వ్యాపారి ముందుకు వచ్చాడు. ఎందుకో అనుకున్నాను నేను.

“సీతాలక్ష్మిగారూ! యీమధ్య కన్పించటమే మానేశారు. మా గుమస్తాని యింటికి పంపిస్తే మీరు లేనట్టు కబురు తెచ్చాడు...” ఇంకేమో వ్యాపారి అనబోతూవుంటే సీతాలక్ష్మి లేనినవ్వు తెచ్చుకుని. “యీ మధ్య నావంట్లో బాగులేదని మీకు తెలీదనుకుంటాను. స్థలం మార్చేటందుకు బందరు పోయా. రేపు మా వాళ్ళతో కలిసివస్తా కదూ! అప్పుడంతా సరి చూస్తా” అంది.

వ్యాపారి కాస్త మర్యాదస్తుడవటంవల్ల మరింకేమీ అనలేదు. నాకు యీ వ్యంగ సంభాషణలు యేం అర్థం కాలేదు. కాని వూహకు తట్టినంతమట్టుకు, వ్యాపారికేమైనా డబ్బు బాకీపడి వుంటుందని వూహించగలిగాను. అంతకు తప్పిస్తే మరింకేం వుంటుంది గనుక...

ఇంటికిపోయే త్రోవలోనే మరోకొట్టుకు తీసుకుపోయింది. అక్కడ ఆమె సలహాపై జరీపంచె కొనటం కూడా జరిగిపోయింది. ముందు షాపులో వర్తకుడు హామీ యిచ్చాడని ఆటంక పర్చాకూడా. “నీకింకా తెలియదబ్బాయ్. చిన్నతనం. వెధవ వర్తకులు అలాగే హామీ యిస్తారు. ఇంతా కాళ్ళీడ్చుకునిపోతే అప్పటికీ రేపంటారు. మొర్రోమని మళ్ళీ తిరిగి రావలసిందే!” అంది సీతాలక్ష్మి. ఈ విషయంల్లో నాకట్టే అనుభవం లేకపోవటంవల్ల ఆమె మాటలు కొంత నమ్మకతప్పిందికాదు. కాని యేదో మనసులో తెలియని అనుమానం పీక్కుతింటూనేవుంది.

ఇల్లు చేరుకున్నాక యీవిషయంలో నేనెంతగానో బాధపడ్డా. ఇంతా వస్తామనిచెప్పి ఎదురు చూస్తుండే వర్తకుని యెలా మోసగించటమా? అన్నది మొదటి ప్రశ్న. రెండోది, హామీఇచ్చిన వర్తకుని విడిచి మరోకొట్టులో కొనటంలో అర్థం ఏమిటా?అని. జవాబులు యిదమిత్థమని తేలేయి కావు. రాత్రిభోజనంచేస్తుంటేబావతోఅందామె, "ఒరేతమ్ముడూ! మనంఇప్పుడు బట్టలుకొన్నామే, వాడు గొప్ప దగాకోరనుకో. నేను రాబట్టి వాడి ఆటలు సాగాయికావుగానీ - కొత్తవాళ్ళని మా బాగా బుట్టలో వేస్తుంటాడు. ఎప్పుడైనా నీకు బట్టలు కావలసివస్తే ఆ కొట్టుకు పోవద్దు. తీపి మాటలతో తిమ్మిరెక్కించి మోసం చేస్తాడు" అంది సీతాలక్ష్మి. నేనాశ్చర్యపోయాను. మొదట్లో అంత మంచిషాపు, నమ్మకమయిందీ మరిలేదని తీసుకపోయిన సీతాలక్ష్మినోట యీ మాటలు రావటం మీకుమాత్రం ఆశ్చర్యం కలిగించకుండా వుంటాయా? ఒక్కసారిగా మారిపోయిందా వ్యక్తి.

చెప్పుకోవాలంటే బావకూడా అలాంటివాడే. ప్రత్యేక వ్యక్తిత్వంలేని మనిషి. ఎటుగాలివస్తే అటే ఒరిగిపోతాడు. సీతాలక్ష్మి మాటలకు కిక్కురుమనలేదు. నేను నా అభిప్రాయం వెలిబుచ్చుదామనుకున్నా. కాని నా చిన్నతనం ఆటంకపర్చింది. అదీకాక అప్పటికే నేనంటే సీతాలక్ష్మికి మంచి అభిప్రాయం లేదన్నసంగతి నాకు తెలుసు.

* * *

ఏబట్ట కొనాలన్నా ఆసక్తి, అభిప్రాయం లేకపోయినా, బట్టలషాపుకి పోవాలని నిశ్చయించుకున్నా. నేను బయటకు వస్తూంటే రామం కొత్తగా కట్టించిన సూటు తెచ్చాడు. నిజంగా ఆప్పట్లో అతణ్ణిచూచి నాకు అసూయ కలిగింది; నేనెందుకలా వుండకూడదని. అంతలోనే నా అంతరాత్మ ఓ లెంపకాయ వేసింది - నీకెందుకా లేనిపోని ఆశలని, వున్నదాంతో సంతృప్తి పొందమని. అదీ ఒకమంచికేననుకుని బయటకుపోయా.

క్రొత్తవూరవటంవల్ల రోడ్లు తెలుసుకోవటం యెంతో కష్టమనిపించింది. చివరకెలాగైతేనేం ఆ బట్టలకొట్టు చేరుకున్నా. ఏదేనాకార్యం సాధించాలన్నా, రహస్యం తెలుసుకోవాలన్నా ఎన్నోచికాకులు పడవలసి వస్తుందికదూ! నేను వెళ్ళంగానే ఆ వ్యాపారి బయటకువచ్చి, నన్ను పోల్చి,"రండిసార్! తక్కినవాళ్లురాలేదండీ?"అదే మొదటిప్రశ్న. అప్పటి అతని ముఖంలో నిరాశ, అంతలోనే కోపం నిండుకున్నయ్.

"లేదండి - యేదోపనివుండి వుండిపోయాను"

"మరి - జరీచాపు వుంచమన్నారుకదా, చూస్తారా?" లోపలికిపోతూ నాకో ఆసనం చూపుతూ అన్నాడు. నేను కాలుస్తున్న సిగరెట్టు పారేసి కూర్చున్నా. ఆ వర్తకుడికి యేం జవాబుచెప్పాలో నాకే అర్థంకాలేదు. వున్నదివున్నట్టు నిజంచెప్పేయాలనుకున్నా.

"ఆవిడ-ఆ సీతాలక్ష్మివుందికదండీ! మరో కొట్టుదగ్గర కొనిపించింది. కొత్తవాళ్ళం మేం మాత్రం యేంచేస్తాంచెప్పండి?"గుట్టు బయటపడుతుందేమోనని చెప్పేశాను.

"నాకు తెలుసండీ! ఆవిడ మరిక్కడకు తిరిగి రాదని; మేం మర్యాదకోసం చూస్తున్నాం. మించిపోయిందంటే ఆ వున్న కాస్త మర్యాద తీసెయ్యాలి మరి. మాదే తప్పులెండి. బుద్ధి గడ్డి తిని అలా మొదటు ఇయ్యాల్సి వచ్చింది."

"ఏంవిటి శెట్టిగారూ! బుద్ధేంవిటి? గడ్డితినట మేమిటి?"

"ఇంకేంటండీ! మొన్న కొడుకుపెళ్లికి దగ్గర దగ్గరగా వేయిరూపాయల బట్టలు కొంది. అప్పుడు కొంత డబ్బు యిచ్చారు. ఇప్పటికింకా 500 రూపాయలకి పైగా యివ్వాలి. ఓ సంవత్సరం కావస్తోంది. ఎప్పటికీ తేల్చరు."

"డబ్బుండికూడా యెందుకిచ్చేయకూడదూ! అలాంటివాళ్లకికూడా అప్పుబాపతులెందుకండి?" అన్నాను అమాయకత్వంలో.

"అవుతే మీకూ యేం తెలీదన్నమాట. పైకి ఉత్తి డాబు బాబూ! అసలు యేమీలేదట. మరి కొన్ని పెద్దకొట్లల్లో యిప్పటివరకు తీర్చని బకాయిలున్నాయట. అదీ తరువాత నాకు తెల్సింది. ఎప్పటికైనా డబ్బురాక పోతుందా? ఒక్క నోటీసిప్పించామంటే వచ్చి పడదూ? ఎందుకీ రాద్ధంతమని అని మంచిమాటలతో చెప్తూంటే వినిపించుకోంటేకదు"అన్నాడా బట్టల వర్తకుడు. ఇదేనా ప్రపంచమంటే అనుకున్నా కాలిపోయిన సిగరెట్టు పారేస్తూ....